క్లుప్తంగా

వాహనాల తనిఖీ



గీసుకొండ : మండలంలోని వరంగల్–నర్సంపేట రహదారిలో పలు ప్రదేశాల్లో గీసుకొండ పోలీస్ ఇన్స్పెక్టర్ రామకృష్ణ ఆధ్వర్యంలో గురువారం వాహనాలు తనిఖీ చేశారు. ఒరిజినల్ ఆర్సీ పేపర్లు లేని ద్విచక్ర వాహనాలు, మూడు ఆటోలను సీజ్ చేశారు. మద్యం తాగి వాహనాలు నడుపుతున్న ఇద్దరిపై కేసులు నమోదు చేశారు. ఎస్సైలు వెంకన్న, శ్వేత, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

స్పోర్ట్స్ స్కూల్ ఎంపికలో విద్యార్థులు

రాయపర్తి : రాష్ట్రస్థాయి స్పోర్ట్స్ స్కూల్ ఎంపికలో మండలంలోని సన్నూరు ప్రాథమిక పాఠశాల విద్యార్థులు పాల్గొన్నట్లు ఎంఈఓ రంగయ్య తెలిపారు. మండలస్థాయి, జిల్లాస్థాయిలో రాణించి ఈనెల 9, 10న మేడ్చల్ జిల్లా హకీంపేటలో నిర్వహించిన ఎంపికలో సన్నూరు, జయరాంతండా(కె) పాఠశాలకు చెందిన విద్యార్థులు చిన్నపల్లి శ్రేయాన్, గుగులోత్ డింపుల్ పాల్గొన్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులను హెచ్ఎం వెంకన్న, బాదావత్ రాజు, గ్రామస్తులు అభినందించారు.

రేపు 'చలో హైదరాబాద్'

ఖానాపురం : సీపీఎస్, ఓపీఎస్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ చేపట్టిన చలో హైదరాబాద్‌ను విజయవంతం చేయాలని టీఎస్ సీపీఎస్ఈయూ మండల అధ్యక్షుడు సుధాకర్, ప్రధాన కార్యదర్శి సురేందర్ గురువారం పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా వారు విలేకరులతో మాట్లాడుతూ ఈనెల 12న నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్‌లో బహిరంగ సభ జరుగుతుందన్నారు. ఉదయం 10 గంటలకు నర్సంపేట అతిథి గృహం వద్దకు వస్తే ప్రత్యేక బస్సుల్లో తరలి వెళ్లనున్నట్లు తెలిపారు. ఈ సభకు సీపీఎస్, ఓపీఎస్ ఉద్యోగులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

మహేశ్వరంలో చోరీ



షాపు వద్ద విచారిస్తున్న పోలీసులు

నర్సంపేట రూరల్ : మహేశ్వరం గ్రామంలోని గురిజాల క్రాస్‌రోడ్డు వద్ద చోరీ జరిగింది. బాధితుడి కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన మచ్చిక రాజు మహేశ్వరంలోని గురిజాల క్రాస్ రోడ్డు సమీపంలో హోటల్, బెల్టుషాపు నిర్వహిస్తున్నాడు. ఈ క్రమంలో గుర్తుతెలియని వ్యక్తులు బుధవారం రాత్రి హోటల్ తలుపును పగలగొట్టి లోపలికి వెళ్లారు. గురువారం ఉదయం రాజు వచ్చి చూసే సరికి తలుపు పగులగొట్టి కనిపించింది. లోపలికి వెళ్లి చూడగా రూ.15వేల విలువైన మద్యాన్ని అపహరించినట్లు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. ఎస్సై రాజు ఘటన స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

సెల్‌ఫోన్ అప్పగింత



సెల్‌ఫోన్ అందజేస్తున్న పోలీసులు

దుగ్గొండి : మండలంలోని గిర్నిబావిలో గల మహాత్మా జ్యోతిబా పూలే గురుకుల విద్యాలయంలో ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న పులి ప్రభాకర్ మూడు నెలల క్రితం తన సెల్‌ఫోన్ పోగొట్టుకొని పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. కేసు విచారించిన పోలీసులు సెల్‌ఫోన్ ఆచూకీ కనుగొని స్వాధీనం చేసుకున్నారు. అనంతరం ప్రభాకర్‌కు గురువారం ఎస్సై పరమేష్ సెల్‌ఫోన్ అందించారు. సెల్‌ఫోన్‌ను పోగొట్టుకున్న వారు ముందుగా మీసేవా కేంద్రంలో దరఖాస్తు చేసుకుని తమకు సమాచారం అందిస్తే సెల్‌ఫోన్ జాడతెలుసుకొని న్యాయం చేస్తామన్నారు. కార్యక్రమంలో రాకేష్, దేవేందర్ పాల్గొన్నారు.

ఉపాధ్యాయులు ప్లాన్ ప్రకారం బోధించాలి

ఐనవోలు : ఉపాధ్యాయులు పీరియడ్ ప్లాన్‌తో బోధించాలని ఎఫ్ఎల్ఎన్ మండల నోడల్ ఆఫీసర్ డాక్టర్ టి.రమేష్ అన్నారు. గురువారం మండల కేంద్రంలో తొలిమెట్టు ఆంగ్ల శిక్షణ కార్యక్రమం జరిగింది. కోర్సు డైరెక్టర్ రమేష్ మాట్లాడుతూ అభ్యాస పుస్తకాలను ఉపయోగించి విద్యార్థుల్లో తగిన నైపుణ్యాలు పెంపొందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఐనవోలు కాంప్లెక్స్ హెచ్ఎం పాక శ్రీహర్షుడు, రిసోర్స్ పర్సన్ వేణుగోపాల స్వామి, స్వప్న, బాలోజు బ్రహ్మాచారి, సీఆర్పీలు రాజ్‌కుమార్, రేవతి, వివిధ పాఠశాలల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

డివైడర్ సరే.. లైటింగ్ ఏది?

- ఇరుకుగా మారిన రహదారి..
- రాత్రి వేళలో వాహనదారుల ఇక్కట్లు..
- వెలుతురు లేక తరచూ ప్రమాదాలు

నెక్కొండ : రోడ్డు విస్తరణ పనులు పూర్తి స్థాయిలో చేయలేదు.. రెండేళ్ల క్రితం డివైడర్లు ఏర్పాటు చేశారు.. కానీ ఇంత వరకు డివైడర్ల మధ్యలో విద్యుత్ దీపాలు ఏర్పాటు చేయడం మరిచిపోయారు. దీంతో తరచూ ప్రమాదాలకు నిలయంగా మారుతోంది. అయినా సంబంధిత అధికారులు ఎటువంటి చర్యలు చేపట్టడం లేదని స్థానికులు, వాహనదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

నెక్కొండ మండల కేంద్రంలో కలెక్టర్ ద్వారా విడుదల చేసిన డీఎంఎఫ్టీ నిధులు రూ.2.40 కోట్లతో వట్టి వాగు నుంచి రైల్వే స్టేషన్ వరకు రోడ్డు విస్తరణ పనులు 2021 ఫిబ్రవరిలో చేపట్టారు. కాగా పనులు ఆగుతూ.. సాగి ఇప్పటికీ అసంపూర్తిగా దర్శనమిస్తున్నాయి. ఈ నిధులతో ఎట్టకేలకు రోడ్డు పనులు చేసి రోడ్డు మధ్యలో డివైడర్ ఏర్పాటు చేశారు. రెండేళ్లు గడిచినప్పటికీ సెంటర్ లైటింగ్స్ ఏర్పాటు చేయలేదు. ఈ రోడ్డుకు ఇరువైపులా ఎస్‌బీఐ, గ్రామీణ బ్యాంక్, డీసీసీ బ్యాంక్, మార్కెట్, తహసీల్దార్, వ్యవసాయ శాఖ, గ్రామ పంచాయతీ కార్యాలయం, ఆర్అండ్‌బీ అతిథి గృహం, ఆర్టీసీ బస్టాండ్, రైల్వే స్టేషన్, పీఏసీఎస్, పోస్టాఫీస్, రెండు మద్యం షాపులు, వారంతపు సంత (అంగడి), మసీద్, ఈద్గా మైదానంలతోపాటు వ్యాపార సముదాయాలు ఉన్నాయి. ఇరుకైన రోడ్డుతో అటు వాహనదారులు, ఇటు ప్రజలు పడరాని పాట్లు పడుతున్నారు. దీంతో మెయిన్ రోడ్డుపై రాత్రి వేళ సరైన వెలుతురు వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.



డివైడర్ మధ్యలో పెరిగిన పిచ్చి మొక్కలు

ప్రమాదాలకు నిలయంగా..

రైల్వే ఓవర్ బ్రిడ్జి నుంచి నర్సంపేట వైపు, రైల్వే స్టేషన్ వైపు వెళ్లాల్సిన వాహనదారులు సరైన వెలుతురు లేని కారణంగా ప్రమాదాలకు గురవుతున్నారు. పెద్ద ప్రమాదం జరగకముందే లైటింగ్స్ ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు.

బస్సులు వెనక్కి తిప్పడం కష్టమే

ఆర్టీసీ బస్సులు బస్టాండ్‌కు వెళ్లక పోవడంతో వాటిని వెనక్కి తిప్పడం కష్టంగా మారింది. డివైడర్లు ఏర్పాటు చేయడంతో రహదారి విస్తరణ తగ్గి అంబేడ్కర్ సెంటర్లో బస్సులు వెనక్కి తిప్పడం డ్రైవర్లకు తలనొప్పిగా మారింది. నర్సంపేట–తొర్రూర్, నర్సంపేట–వరంగల్‌తోపాటు నెక్కొండకు వచ్చిపోయే లోకల్ బస్సుల డైవర్లు తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని వాపోతున్నారు.

డివైడర్లలో మొక్కలేవి..



డివైడర్లలో మొక్కలు పెంచుతామన్నారు. అందులో మొక్కలకు అవసరమైన సారవంతమైన మట్టి పోయాల్సి ఉండగా రాళ్లు, రప్పలు, చెత్త పోశారు. గతేడాది మొక్కలు నాటుతారని ఆశించినా ఫలితం లేదు. దీంతో పిచ్చిమొక్కలతో డివైడర్లు దర్శనమిస్తున్నాయి. ఈ సారైనా డివైడర్ల మధ్యలో లైటింగ్‌తోపాటు హరితహారం కింద పూలు, నీడనిచ్చే మొక్కలు నాటాలని ప్రజలు కోరుతున్నారు.

– యామానాచార్యులు, సామాజిక వేత్త

ఎమ్మెల్యే హామీ నెరవేర్చాలి



రోడ్డు విస్తరణకు నిధులు కేటాయించి, సైడ్ కాల్వల నిర్మాణాలకు నిధులు కేటాయించక పోవడం విచారకరం. డివైడర్ల మధ్య మట్టి పోయలేదు. చెట్లు నాటడంలోనూ నిర్లక్ష్యం ఉంది. ఆర్అండ్‌బీ అధికారులు ముందస్తుగా ఇరువైపులా కాల్వల నిర్మాణ పనులు చేపట్టకుండా రోడ్డు విస్తరణ పనులు చేపట్టారు. దీంతో మురుగు నీరు రోడ్లపై పారుతోంది. రెండు వైపులా డ్రెయినేజీ నిర్మాణానికి కృషి చేస్తానని ఎమ్మెల్యే ఇచ్చిన హామీ నెరవేర్చాలి.

– యమునారెడ్డి, సర్పంచ్, నెక్కొండ

రాత్రి వేళ సరైన వెలుతురు ఉండేలా అధికారులు చొరవ చూపాలని పలువురు డిమాండ్ చేస్తున్నారు.

ఎన్‌సీసీ ఎయిర్‌వింగ్ యూనిట్ ప్రారంభం

వర్ధన్నపేట : విద్యార్థుల అభ్యున్నతికి తల్లిదండ్రులతో పాటు ఉపాధ్యాయులు పాటుపడాలని మున్సిపల్ చైర్‌పర్సన్ ఆంగోత్ అరుణ, ఎన్‌సీసీ అధికారి కె.సందీప్‌కుమార్ అన్నారు. గురువారం వర్ధన్నపేట జెడ్పీఎస్ఎస్‌లో ఎన్‌సీసీ ఎయిర్‌వింగ్ యూనిట్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఎన్‌సీసీ వల్ల విద్యార్థి జీవితంలో క్రమశిక్షణ అలవడుతుందన్నారు. తెలంగాణలోనే మొత్తం మూడు ప్రభుత్వ పాఠశాల్లోకి ఈ యూనిట్ రావడం ఎంతో సంతోషమన్నారు. అనంతరం ఎన్‌సీసీ పవర్‌పాయింట్ ప్రదర్శించారు. కౌన్సిలర్ తోటకూరి రాజమణి, హెచ్ఎం సురేందర్, పాఠశాల అసోసియేట్ ఎన్‌సీసీ అధికారి ఫస్ట్ ఆఫీసర్ నిమ్మ మనుజేందర్ రెడ్డి, ఎన్‌సీసీ అధికారులు నాగరాజు, జూనియర్ వారెంట్ ఆఫీసర్ శర్మ, సార్జంట్‌లు నవీన్, రమేష్, ఉపాధ్యాయులు నర్సింహమూర్తి, రాంచందర్, అనిల్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.



ఎన్‌సీసీ కేడెట్లతో అధికారులు, ఉపాధ్యాయులు

మహాసభను విజయవంతం చేయాలి

నర్సంపేట రూరల్ : రెండున్నర దశాబ్దాలుగా విద్యారంగ అభివృద్ధి, ఉపాధ్యాయ సమస్యల పరిష్కారం కోసం నిరంతరం కృషి చేస్తున్న డెమోక్రటిక్ టీచర్స్ ఫెడరేషన్ రజతోత్సవ మహా సభలను అక్టోబర్ నెలలో మహబూబ్‌నగర్ కేంద్రంగా నిర్వహిస్తున్నట్లు ఈ సభలను విజయవంతం చేయాలని డీటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి అటుకుల శ్రీనివాస్‌రెడ్డి కోరారు. నర్సంపేట మండలంలోని ఇటుకాలపల్లి జిల్లా పరిషత్ పాఠశాలలో మహా సభల కరపత్రాలు గురువారం ఆవిష్కరించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విద్యారంగాన్ని తీవ్రంగా నిర్లక్ష్యం చేస్తున్నాయని, ఆ కారణంగా సమజంలో పేద వర్గాల బిడ్డలకు నాణ్యమైన విద్య అందకుండా చేస్తున్నాయని, తద్వారా సమాజంలో, సామాజిక, ఆర్థిక అసమానతలు రోజు రోజుకు మరింతగా పెరుగుతున్నాయన్నారు. కావున విద్యారంగాన్ని తిరోగమనంలోకి తీసుకెళ్లే విధంగా ఉన్న నూతన జాతీయ విధానమును రద్దుచేసి పేద విద్యార్థులకు సమాన అవకాశాలు గల నాణ్యమైన విద్యను అందించే కామన్ స్కూల్ విధానాన్ని తీసుకురావాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు దార్ల రవీందర్, మండల అధ్యక్షుడు ఎస్‌కే సర్దార్, ప్రధాన కార్యదర్శి పి. రవి, సీనియర్ కార్యకర్తలు కుమారస్వామి, రఘుపతి, సంతోష్ కుమార్, రాజేందర్, వెంకటేశ్వర్లు, వీరేందర్, రామస్వామి, చందర్, మహేందర్, నర్సింహా, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.



వాల్ పోస్టర్లు ఆవిష్కరిస్తున్న డీటీఎఫ్ నాయకులు

అధికార పార్టీ నాయకులకు బుద్ధి చెప్పాలి

- మాజీ ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి

నర్సంపేట : నియోజకవర్గంలో ప్రతిపక్ష పాత్రే లేదని విర్రవీగుతున్న అధికార పార్టీ నాయకులకు తగిన బుద్ధి చెప్పాలని మాజీ ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి అన్నారు. ఈ మేరకు పట్టణంలోని వాసవీ కళ్యాణ మండపంలో గురువారం పార్టీ కార్యకర్తలు, శక్తి కేంద్రాల బాధ్యులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రకాశ్‌రెడ్డి మాట్లాడుతూ బీజేపీ కార్యకర్తలు ప్రజల వెన్నంటి ఉంటూ వారి సమస్యలు తెలుసుకుంటూ పోరాటం చేయాలని పిలుపునిచ్చారు. ప్రజల పక్షంగా ప్రజాక్షేత్రంలో వారి తరఫున నిలబడితే వారి మనసు గెలుచుకోవడం కష్టం కాదన్నారు. అధికార బీఆర్ఎస్ పార్టీ ఆగడాలను ఎప్పటికప్పుడు ఎండగడుతూ, నాయకుల అవినీతిపై పోరాటం చేస్తూ ముందుకు సాగాల్సిన అవసరం ఉందని అభిప్రాయ పడ్డారు. కార్యకర్తలంతా ఏకతాటిపైకి వచ్చి బీజేపీని అధికారంలోకి తీసుకు రావడమే లక్ష్యంగా అన్ని అవకాశాలను వాడుకోవాలని దిశా నిర్దేశం చేశారు. ఈ సమావేశంలో బీజేపీ పార్లమెంట్ కో కన్వీనర్ జాటోతు సంతోష్‌నాయక్, నియోజకవర్గ కన్వీనర్ వడ్డేపల్లి నర్సింహరాములు, జిల్లా ప్రధాన కార్యదర్శి రేసు శ్రీనివాస్, జిల్లా మహిళా మోర్చా అధికార ప్రతినిధి చిలువేరు రజనిభారతి, పట్టణ అధ్యక్షుడు బాల్నె జగన్, నల్లబెల్లి సుదర్శన్, పెంచాల సతీష్, జూలూరి మనీష్, మండ కార్తీక్, పార్టీ కార్యకర్తలు, శక్తికేంద్ర బాధ్యులు, తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న రేవూరి ప్రకాశ్‌రెడ్డి

రాగిజావ పంపిణీ

ఐనవోలు : విద్యార్థులకు రాగిజావ అందించడం వల్ల పౌష్టికాహారలోపం తగ్గుతుందని పున్నేలు సర్పంచ్ కత్తి దేవేందర్ అన్నారు. గురువారం మండలంలోని పున్నేలు గ్రామంలో సర్పంచ్ దేవేందర్ ముఖ్య అతిథిగా హాజరై విద్యార్థులకు రాగిజావ అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రైవేటు పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులను మన ఊరు–మన బడి ద్వారా ప్రభుత్వం కల్పిస్తున్నట్లు చెప్పారు. మధ్యాహ్న భోజనాన్ని అందిస్తున్న ప్రభుత్వం విద్యార్థుల్లో పౌష్టికాహార లోపాన్ని గుర్తించి రాగిజావను వారంలో మూడు రోజులు అందించాలని నిర్ణయించిందన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో లభిస్తున్న సదుపాయాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

బాధ్యతల స్వీకరణ

ఐనవోలు : మండల తహసీల్దార్‌గా కానుపర్తి విక్రమ్ కుమార్ గురువారం బాధ్యతలు స్వీకరించారు. రాష్ట్ర వ్యాప్తంగా ఇటీవల జరిగిన బదిలీల్లో ఐనవోలు తహసీల్దార్ సుభాషిణి బదిలీపై రాగా ఇక్కడ పనిచేస్తున్న తహసీల్దార్ బొనగాని రాజేష్ వరంగల్ జిల్లా నల్లబెల్లికి బదిలీ అయ్యారు. ఆగస్టు 4న సుభాషిణి బాధ్యతలు కూడా స్వీకరించారు. వారం రోజుల్లోనే సుభాషిణిని గీసుకొండకు బదిలీ చేయగా వరంగల్ జిల్లా మైనార్టీ ఆఫీసర్‌గా విధులు నిర్వర్తిస్తున్న విక్రమ్‌కుమార్‌ను ఐనవోలు తహసీల్దార్‌గా బదిలీ చేశారు. కాగా నూతనంగా బాధ్యతలు స్వీకరించిన విక్రమ్ కుమార్‌కు రెవెన్యూ కార్యాలయ సిబ్బంది శుభాకాంక్షలు తెలిపారు.

జాతీయ జెండాలతో ర్యాలీ

నర్సంపేట : పంద్రాగస్టు సందర్భంగా డివిజన్‌లోని అన్ని మండలాల పోస్టల్ ఉద్యోగులు గురువారం నర్సంపేట పోస్టల్ ఇన్స్పెక్టర్ శ్రీమంతుల రమేష్ ఆధ్వర్యంలో ద్విచక్ర వాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా రమేష్ మాట్లాడుతూ.. పంద్రాగస్టును పురస్కరించుకొని జాతీయ జెండాను ప్రతీ కుటుంబం కొనుగోలు చేసి వినియోగించుకొని జెండా ప్రతిభ చాటాలని కోరారు. కార్యక్రమంలో దార్ల రాజేందర్, వెంకటేశ్వర్లు, యాకోబు, భాష, శివకుమార్, నర్సంపేట, ఖానాపురం, చెన్నారావుపేట, గూడూరు, నల్లబెల్లి, దుగ్గొండి, పోస్టల్ ఉద్యోగులు పాల్గొన్నారు.



ర్యాలీ నిర్వహిస్తున్న పోస్టల్ సిబ్బంది

అభివృద్ధి పనులు ప్రజలకు వివరించాలి



సమావేశంలో మాట్లాడుతున్న రవీందర్‌రెడ్డి

నర్సంపేట : నర్సంపేటలోని వార్డుల్లో జరుగుతున్న అభివృద్ధి సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించాలని రాష్ట్ర రైతు సమన్వయ కమిటీ డైరెక్టర్ రాయిడి రవీందర్‌రెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ గుంటి రజనికిషన్, నాయకుడు డాక్టర్ లెక్కల విద్యాసాగర్‌రెడ్డి అన్నారు. ఈ మేరకు పట్టణంలోని 3, 4వార్డులలో ముఖ్య నాయకులు, కార్యకర్తల సమావేశం స్థానిక కౌన్సిలర్లు లూనావత్ కవితవీరు నాయక్, శీలం రాంబాబు అధ్యక్షతన గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కాంగ్రెస్, బీజేపీలు రాజకీయ నిరుద్యోగంతో అసత్య ప్రచారాలు చేయడం మొదలు పెట్టి ప్రజలను తప్పుదోవ పట్టించడానికి ప్రయత్నం చేస్తున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో దార్ల రమాదేవి, వేణుముద్దల శ్రీధర్‌రెడ్డి, మండల శ్రీనివాస్, రాయిడి దుశ్యంత్‌రెడ్డి, స్వామి, సారంగం, వెంకటేశ్వర్లు, వార్డుల అధ్యక్షుడు, స్థానికులు తదితరులు పాల్గొన్నారు.

కుట్టుశిక్షణ కేంద్రాల సందర్శన

రాయపర్తి : ఎర్రబెల్లి దయాకర్‌రావు చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఉచిత కుట్టుశిక్షణ కేంద్రాలను గురువారం ట్రస్ట్ చైర్‌పర్సన్ ఎర్రబెల్లి ఉషాదయాకర్‌రావు సందర్శించి పరిశీలించారు. ఈ సందర్భంగా మండలంలోని కాట్రపల్లి, తిర్మలాయపల్లి గ్రామాల్లో నిర్వహిస్తున్న కుట్టు శిక్షణకేంద్రాలను సందర్శించారు. అనంతరం శిక్షణ తీసుకున్న రికార్డులను నేర్చుకున్న తీరుతెన్నులను ఆమె పరిశీలించారు. ఎంపీపీ జినుగు అనిమిరెడ్డి, సర్పంచ్, ఎంపీటీసీలు గారె నర్సయ్య, ఐత రాంచందర్, గజవెల్లి అనంత, ఎల్లయ్య, సీసీలు తదితరులు పాల్గొన్నారు.



శిక్షణ పొందిన వారితో ఉషాదయాకర్‌రావు

యువత వ్యసనాలకు బానిస కావొద్దు



మాట్లాడుతున్న సీఐ హథీరామ్

చెన్నారావుపేట : యువకులు వ్యసనాలకు బానిస కావొద్దని సీఐ హథీరామ్ అన్నారు. ఈ మేరకు మండలంలోని బాపునగర్‌లో బుధవారం రాత్రి మూఢనమ్మకాలు, డయల్–100, బాల్య వివాహాలు, సీసీ టీవీలు, గుట్కా, గంజాయిపై జాగృతి పోలీస్ కళాబృందంతో కళాజాతా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మత్తు పానీయాలకు, గంజాయి అలవాట్లతో జీవితాలను నాశనం చేసుకోవద్దని అన్నారు. వృద్ధులైన తల్లిదండ్రులను మంచిగా చూసుకోవాలన్నారు. సైబర్ టోల్ నంబర్ 1930పై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ బాదావత్ మంగమ్మ, ఎస్సై తోట మహేందర్, ఏఎస్సై లక్ష్మణమూర్తి, కళాకారులు విలియం వెంకటేశ్వర్లు, రత్నయ్య, శ్రీనివాస్, నారాయణ, చిరంజీవి, విక్రమ్ రాజు, గ్రామస్తులు, తదితరులు పాల్గొన్నారు.

గిరిజన సంస్కృతికి ప్రతీక 'తీజ్'



సంగెం: మహరాజ్ తండాలో తీజ్ ఉత్సవంలో పాల్గొన్న గిరిజన మహిళలు, చిన్నారులు

సంగెం : గిరిజనుల సంస్కృతీ, సంప్రదాయాలకు ప్రతీకగా తీజ్ పండుగ నిలుస్తోందని పోచమ్మతండా శివారులోని మహరాజ్ తండా పెద్ద బానోత్ దేవ్ సింగ్ అన్నారు. గురువారం మండలంలోని మహరాజ్ తండాలో స్థానికులతో కలిసి తీజ్ ఉత్సవంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. భావితరాలకు గిరిజన సంస్కృతీ, సంప్రదాయాలను అందించాల్సిన బాధ్యత ప్రతిఒక్కరిపై ఉందన్నారు. అనంతరం యువతులు నృత్యాలు చేసి ఆడిపాడుతూ తీజ్ నిమజ్జనం చేశారు. వేడుకలో వార్డు సభ్యులు నూనవత్ శ్రీను, బానోత్ అమర్‌సింగ్, మంగమ్మ, లాల్‌సింగ్, తిరుపతి, జగన్, వీరేందర్, యాకుబ్ తండావాసులు, మహిళలు పాల్గొన్నారు.

ఘనంగా తీజ్..

గీసుకొండ : మండలంలోని హర్జ్యాతండా గ్రామంలో బంజారాలు, మహిళలు గురువారం తీజ్ పండుగ వేడుకలను ఘనంగా నిర్వహించారు. యువతులు బుట్టల్లో నానబెట్టి, మొలకెత్తిన గోధుమ నారును తలపై పెట్టి ఊరేగింపుగా తరలివెళ్లి దగ్గరోని చెరువుల్లో నిమజ్జనం చేశారు. సర్పంచ్ ఆంగోత్ కవిత, ఉపసర్పంచ్ ఆంగోత్ నర్సింహ, బీఆర్ఎస్ గ్రామ అధ్యక్షుడు ఆంగోత్ వీరన్న, యూత్ అధ్యక్షుడు తిరుపతి, రాజు, ప్రకాశ్, ప్రశాంత్, ప్రేమ్, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.



గీసుకొండ: హర్జ్యాతండా తీజ్ వేడుకల్లో ..

'గృహలక్ష్మి' గడువు పొడిగించాలి



చెన్నారావుపేట: జిరాక్స్ సెంటర్ వద్ద సందడి



నర్సంపేట: ఆర్డీఓకు వినతిపత్రం అందజేస్తున్న న్యూడెమోక్రసీ నాయకులు

నర్సంపేట : తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం గృహలక్ష్మి దరఖాస్తుకు గడువును పొడిగించాలని సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ డివిజన్ కార్యదర్శి ఎలకంటి రాజేందర్ డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆర్డీఓ కృష్ణవేణికి గురువారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గృహలక్ష్మి పథకం కింద ఇళ్లు లేని పేదలకు ఇంటి స్థలం ఉంటే రూ.3లక్షలు ప్రభుత్వం నుంచి అందిస్తామని చెప్పి కేవలం మూడు రోజుల సమయం ఇచ్చి దరఖాస్తులు చేసుకోమని ప్రకటించారన్నారు. దరఖాస్తును 20రోజుల పాటు పొడిగించి పేదలందరికి ఇంటి నిర్మాణానికి రూ.5లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పీడీఎస్‌యూ డివిజన్ కార్యదర్శి గుర్రం అజయ్, పీవైఎల్ జిల్లా కార్యదర్శి దనసరి సురేష్, పార్టీ జిల్లా నాయకులు గట్టి కృష్ణ, సామన్న, రవి, రాజు తదితరులు పాల్గొన్నారు.

పేదలను మోసం చేస్తున్న బీఆర్ఎస్

పేదల దరఖాస్తు, దస్తావేజుల నకలు పత్రాలతో రాష్ట్ర ప్రభుత్వం చలి కాగుతోందని నర్సంపేట మున్సిపాలిటీ కాంగ్రెస్ పార్టీ ఫ్లోర్ లీడర్ వేముల సాంబయ్యగౌడ్ అన్నారు. ఈ సందర్భంగా గురువారం ఆయన మాట్లాడుతూ.. గృహలక్ష్మి పథకం పేరుతో ప్రజలను మరోసారి మోసం చేయడానికి బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రయత్నిస్తుందని ఆరోపించారు. ప్రజలను మభ్య పెడుతూ ఎన్నికల వేళ ఓట్లు దండుకునే ప్రయత్నం తప్ప ఈ ప్రభుత్వం గృహలక్ష్మి పథకం అమలు చేస్తుందన్న నమ్మకం ప్రజలలో లేదన్నారు. దరఖాస్తు చేసుకున్న అర్హులైన ప్రతి కుటుంబానికి గృహలక్ష్మి అమలు చేయాలని లేదా కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ప్రభుత్వాన్ని అడ్డుకుంటామని, రాబోయే ఎన్నికల్లో ప్రజలు తగిన బుద్ధి చెబుతారని అన్నారు.

'గృహలక్ష్మి'కి భారీగా దరఖాస్తులు

ఖానాపురం : ఖానాపురం తహసీల్దార్ కార్యాలయ ఆవరణలో తహసీల్దార్ కిరణ్‌కుమార్, టి. సృజన్‌కుమార్, ఆర్ఐ సత్యనారాయణల ఆధ్వర్యంలో ప్రత్యేక కౌంటర్‌ను ఏర్పాటు చేయించి దరఖాస్తుల స్వీకరణ చేపట్టారు. మూడు రోజుల నుంచి మండల పరిధిలోని ప్రజలు తరలివచ్చి దరఖాస్తులు అందజేశారు. మూడు రోజుల వ్యవధిలో 3,040 దరఖాస్తులు వచ్చినట్లు అధికారులు తెలిపారు.

చెన్నారావుపేట : సొంత స్థలం ఉన్నవారికి గృహలక్ష్మి పథకం ద్వారా ఇంటిని నిర్మించుకోవడానికి ప్రభుత్వం రూ.3 లక్షలు దశల వారికి ఇస్తామని ప్రకటించడంతో దరఖాస్తు చేసుకోవడానికి ప్రజలు ఎగబడ్డారు. దరఖాస్తుకు చివరి తేదీ గురువారం అని ప్రకటించడంతో తహసీల్దార్ కార్యాలయానికి పరుగులు తీశారు. కుల, ఆదాయ పత్రాల కోసం మీ సేవ, జిరాక్స్ సెంటర్‌ల వద్ద దరఖాస్తు చేసుకున్నారు. ఈ పథకం నిరంతర ప్రక్రియ అని రాష్ట్ర మంత్రి బుధవారం ప్రకటించారు.

బాధిత కుటుంబాన్ని ఆదుకోవాలి



వర్ధన్నపేట : మండలంలోని ఇల్లందలో ఇటీవల గ్యాస్ సిలిండర్ పేలి సర్వం కోల్పోయి వీధిన పడ్డ బాధిత కుటుంబాన్ని గురువారం కాంగ్రెస్ నాయకుడు కేఆర్ నాగరాజు పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రమాదవశాత్తు ఇల్లు కాలిపోయి కుటుంబం వీధిన పడినపుడు రెవెన్యూ అధికారులు స్పందించి వారిని ఆదుకోవాలన్నారు. ఇప్పటి వరకు ఏ ఒక్క అధికారి సందర్శించక పోవడంతో పాటు ఆ కుటుంబ పరిస్థితి పట్టించుకోక పోవడంపై ఆయన అసహనం వ్యక్తం చేశారు. అగ్నిమాపక అధికారులతో మాట్లాడారు. ఇల్లు ఎలా కాలిపోయింది.. ఇందుకు విద్యుత్ షార్ట్ సర్క్యూట్ వల్లనా.. లేదా గ్యాస్ సిలిండర్ లీకేజీ వల్లన అనేది ప్రభుత్వానికి నివేదిక ఇవ్వాలని కోరారు. ఆయన వెంట నాయకులు ఎద్దు సత్యనారాయణ, పోశాల వెంకన్న తదితరులు ఉన్నారు.